సాక్షి
ఒడిశా
సోమవారం | 6 | మే | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,46,822లు, బంగారం 51 గ్రాముల 400 మిల్లీగ్రాములు, వెండి 26 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

8న రాయగడకు రాజ్‌నాథ్ సింగ్



కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈనెల 8వ తేదీన రాయగడ రానున్నారు.

- 8లో



పూరీ కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహం

పూరీ సదర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిని ఏఐసీసీ మార్చడంతో పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

బరంపురంలో ప్రధాని మోదీ పర్యటన నేడు



బరంపురం: ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నగర శివారులోని కొనిసి గ్రామంలో సోమవారం జరగనున్న బహిరంగా సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనున్నారు. సభలో గంజాం, అస్కా, భంజనగర్, పుల్బణి, నయగడా జిల్లాలకి చెందిన పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈనెల 9న గోపాల్‌పూర్‌లో సీఎం నవీన్ పర్యటన



బరంపురం: ఈనెల 9వ తేదీన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గంజాంలోని గోపాల్‌పూర్‌లో పర్యటించనున్నారు. ఆరోజు ఉదయం 9.30 గంటల సమయంలో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్ నుంచి సీఎం నవీన్ బిజూ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకొని, ప్రత్యేక హెలీప్యాడ్‌లో గంజాం జిల్లా బరంపురం నగరానికి దగ్గర రొంగయిలొండా పరిధిలోని పాలురు హిల్స్‌లో దిగుతారు. అక్కడకి దగ్గర కొరపల్లిలో ఏర్పాటు చేసిన బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం అస్కాకి ప్రత్యేక హెలీప్యాడ్‌లో బయల్దేరి పార్టీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం కొందమాల్ జిల్లా పుల్బణికి ప్రత్యేక హెలీప్యాడ్‌లో చేరుకొని బహిరంగ సభలో పాల్గొని ప్రసగించనున్నారు. అనంతరం తిరిగి పుల్బణి నుంచి భువనేశ్వర్ చేరకోనున్నారు.

ముగ్గురు దోపిడీ దొంగల అరెస్టు



కుంద్రా పోలీసులకు చిక్కిన దొంగలు

జయపురం: జాతీయ రహదారిపై వెళ్లేవారిని బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలు పోలీసులకు చిక్కారు. జయపురం సబ్‌డివిజన్ పోలీసులు వీరిని శనివారం అరెస్టు చేసినట్లు కుంద్ర పోలీసు అధికారి చిత్తరంజన్ ప్రధాన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక బైక్, మొబైల్ ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో మరిగుడ గ్రామానికి చెందిన మనోజ్ సాగరియ, కలియ గ్రామానికి చెందిన రంజన్ హరిజన్తో పాటు మైనర్ బాలుడు ఉన్నట్టు పేర్కొన్నారు. వీరు జాతీయ రహదారిలో ప్రయాణికులను అడ్డగించి మారణాయుధాలు చూపి భయపెట్టి వారి వద్ద ఉండే డబ్బులు, ఇతర విలువైన వస్తువులను దోపిడీ చేసేవారని వివరించారు. వీరి ఆగడాలపై ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో మైనర్ ఉండడంతో అతడిని బాల నేరస్తుల కోర్టుకు పంపించామన్నారు. మిగతా ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరిచినట్టు వెల్లడించారు. కుంద్ర ప్రాంతంలో జరిగిన పలు దొంగతనాలు, దోపిడీలతో వీరికి సంబంధం ఉన్నట్టు పేర్కొన్నారు.

బీజేపీ ఆరు గ్యారెంటీలు.. ఒడిశాలో అమలు చేస్తాం



మోదీ ఆరు గ్యారెంటీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: ఒడిశాలో జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో విజయకేతనం ఎగురవేస్తుందని పార్టీ రాష్ట్ర ప్రతినిధి జ్ఞాన రంజన్ బెహరా విలేకరులతో అన్నారు. స్థానిక విశ్వనాథ్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ప్రభుత్వం శాసనంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు గ్యారేంటీలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో నవీన్ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఒక్కరికైనా ప్రభుత్వం ఉద్యోగం కల్పించిందా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట, ప్రతి ఇంటిలో ఆడపడుచుకు రూ.1000, పీఎం ఆవాస్ యోజనా కింద పేదలకు ఇళ్లు, ధాన్యానికి మద్దతు ధర, పర్లాకిమిడిలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు, జిల్లా కేంద్రంలో ప్రధాన రహదార్లు వేస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం బరంపురంలోని కోనిసిలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని జ్ఞాన బెహరా అన్నారు. ఈ సమావేశంలో ఛిత్రి సింహాద్రి, బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, జిల్లా యువజన మోర్చా కార్యదర్శి బాలకృష్ణ పాత్రో, దేవి ప్రసాద్ దాస్, కౌన్సిలర్ బబునా బెహరా తదితరులు పాల్గొన్నారు.

తొలి దశ బరిలో.. ధనిక, పేద అభ్యర్థులు వీరే



ప్రమీలా పూజారి



సంతృప్త మిశ్రా

- రూ.461 కోట్లు ఆస్తి కలిగి ఉన్న సంతృప్త మిశ్రా
- అత్యంత పేద అభ్యర్థిగా పోటీలో ఉన్న ప్రమీలా పూజారి

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల కోసం ఇప్పటివరకు నామినేషన్ల దాఖలు చేసిన అభ్యర్థుల్లో బీజేడీకి చెందిన సంతృప్త మిశ్రా (58) అత్యంత ధనవంతుడు కాగా, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) ప్రమీలా పూజారి (25) అత్యంత పేద అభ్యర్థిగా నిలిచారు. కటక్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ మాజీ హెచ్ఆర్ హెడ్ సంతృప్త మిశ్రా ఆస్తుల విలువ రూ.461 కోట్లు. ఆయనకు రూ.408 కోట్ల చరాస్తులు, రూ.53 కోట్ల స్థిరాస్తులున్నాయి. అతని ఐటీఆర్ ప్రకారం ఆదాయం 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ. 76.23 కోట్లు, 22–23లో రూ. 66.21 కోట్లు. ఆదిత్య బిర్లా గ్రూప్ నుంచి స్వచ్ఛంద ఉద్యోగ విరమణను పొందిన తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో బిజూ జనతా దళ్‌లో చేరారు. ఆయనకు లండన్‌లోని ఓ బ్యాంకులో 100 పౌండ్ల (రూ.10,521కి సమానం) సహా దాదాపు రూ.4 కోట్ల బ్యాంకు డిపాజిట్లను కలిగి ఉన్నారు. బాండ్లు (5 సంస్థలు), షేర్లు (111 కంపెనీలు), మ్యూచువల్ ఫండ్స్ (60 కంపెనీలు), ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు (ఆరు కంపెనీలు)లో అతని ఆస్తులు ప్రస్తుతం దాదాపు రూ.308 కోట్లు. రూ. 2.3 కోట్ల విలువైన లగ్జరీ కార్ల సముదాయాన్ని కూడా మిశ్రా కలిగి ఉన్నారు. శుక్రవారం తన నామినేషన్ పత్రాల దాఖలు సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య చరాస్తుల విలువ రూ.11.72 కోట్లుగా పేర్కొన్నారు.

- రూ.300 కోట్ల ఆస్తులతో కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రౌర్కెలా అసెంబ్లీ అభ్యర్థి దిలీప్ రాయ్ రెండో స్థానంలో నిలిచారు.
- జయపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ గ్రాడ్యుయేట్ అయిన ప్రమీలా పూజారి కొరాపుట్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. భారత స్టేట్ బ్యాంక్ పొదుపు ఖాతాలో రూ.19,500, బైపారిగూడ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో మరో రూ.1,125 ఉన్నట్లు ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆమె ఎన్నికల్లో పోరాడేందుకు ప్రజల నుంచి పొందిన ఆర్థిక సహకారంగా పేర్కొన్నారు. ఆమె ఇంటింటికీ వెళ్తూ గ్రామ సమావేశాల ద్వారా సమాజ మద్దతును పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
తాను అధికారంలోకి వస్తే.. ఈ ప్రాంతంలో ఆరోగ్య సేవలు, విద్యను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తాను. గిరిజన విద్యార్థులలో పెరుగుతున్న డ్రాపౌట్ రేటును తగ్గించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.
- ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఏడీఆర్) నివేదిక ప్రకారం రాష్ట్రంలో తొలి దశ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థిలో ప్రమీలను పేద అభ్యర్థిగా పేర్కొంది. రాజ కుటుంబానికి చెందిన బీజేపీ ఎంపీ అభ్యర్థి మాళవిక కేశరి దేవ్ రూ. 41.89 కోట్లు విలువైన ఆస్తులు కలిగిన అత్యంత సంపన్నురాలుగా ఈ నివేదిక పేర్కొంది.
- నవరంగపూర్, బరంపుం, కొరాపుట్ మరియు కలహండి లోక్ సభ నియోజకవర్గాల నుంచి మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. మే 13న దేశ వ్యాప్తంగా నాలుగో దశ, ఒడిశాలో తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. వారిలో మొత్తం 17 మంది బీజేపీ, బీజేడీ అభ్యర్థులు కోటీశ్వరులు. ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులు, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు, భారతీయ బికాష్ పరిషత్ నుంచి ఒకరు, నవ భారత నిర్మాణ సేవా పార్టీకి చెందిన మరొకరు కోటి రూపాయలకు పైగా ఆస్తులను ప్రకటించారు.
- మాళవిక కేశరి దేవ్ తర్వాత బరంపురం స్వతంత్ర అభ్యర్థి వి.చంద్ర శేఖర్ (రూ. 28.70 కోట్లు), భారతీయ బికాష్ పరిషత్‌కు చెందిన రాజేంద్ర దాల్‌బెహెరా రూ.10.30 కోట్లు విలువైన ఆస్తులు కలిగి ఉన్నారు. బరంపురం లోక్ సభ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టరు ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి అత్యధికంగా రూ.3.82 కోట్ల అప్పులు కలిగి ఉన్నారని నివేదిక పేర్కొంది.

బీజేడీ అప్రవాసి సమాఖ్య ఏర్పాటు

రాయగడ: వలసదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించే విధంగా బిజూ జనతాదళ్ అప్రవాసి సమాఖ్య ఏర్పాటయ్యింది. ఈ సమాఖ్య రాష్ట్ర స్థాయి కార్యవర్గాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పేరిట శంఖ్ భవన్ నుంచి ఆదివారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య సలహాదారునిగా డాక్టర్ అమర్ పట్నాయక్, సలహాదారులుగా రజేంద్ర దొలకియా, నెక్కంటి భాస్కరావు, సుజిత్ కుమార్, భుపేంద్ర సింగ్‌లు నియమితులయ్యారు. అదేవిధంగా ఈ సమాఖ్యలో స్టేట్ కన్వీనర్‌గా నందలాల్ సింగ్ వ్యవహరిస్తారు. వైస్ కన్వీనర్లుగా బారమేశ్వర్ సింగ్ యాదవ్, అలామ్ సింగ్ రూప్రా, రామ్మూర్తి తివారి, సాధారణ కార్యదర్శులుగా మనోజ్ శర్మ, ముకుంద్ సిన్హా, బినోద్ కుమార్ మహేశ్వరి, శుభాస్ అగ్రవాల్, ఆనంద్ అగ్రవాల్, నిషాన్ దగ, రామచరన్ సాహు, సునీల్ తివారి, రాహుల్ పాండే, సంజయ్ యాదవ్, దాలియా దేవంత్, శుభాష్ జైన్, అనిల్ కుమార్ సింగ్‌లు నియమితులైనట్లు వెలువడిన ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రానికి 'చల్లని కబురు'



భువనేశ్వర్: రాష్ట్ర ప్రజలకు స్థానిక వాతావరణ శాఖ ఆదివారం చల్లని సమాచారం అందించింది. రానున్న 3 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం చల్లబడుతుందని పేర్కొంది. గత కొద్ది రోజులుగా నిర్విరామంగా వేధించిన వడగాలుల తీవ్రత కనుమరుగయ్యే అవకాశం ఉన్నట్లు ఈ కేంద్రం పేర్కొంది. త్వరలో రాష్ట్రంలో వర్షం, మెరుపులు, ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వాన కురుస్తుందని వాతావరణ శాఖ ముందస్తు అంచనా వేసింది. వాతావరణ కార్యాలయం సమాచారం ప్రకారం వాతావరణ మార్పుతో కురియనున్న వర్షపాతం ఉపశమనం కలిగిస్తుంది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే కొద్దిరోజుల్లో 30 నుంచి 40 కి.మీ వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది. అలాగే రానున్న 24 గంటల్లో పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రతలో చెప్పుకోదగిన మార్పు లేకున్నా, తదుపరి 3 నుంచి 4 రోజుల్లో కాలవైశాఖి తాండవంతో పగటిపూట ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్ నుంచి 6 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గుతుందని ఐఎండీ తెలిపింది. రానున్న 24 గంటల్లో కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, గంజాం, గజపతి, కొరాపుట్, రాయగడలో కొన్నిచోట్ల మెరుపులు, ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ వ్యవధిలో మయూర్‌భంజ్, కెంజొహర్, బౌధ్, అంగుల్, నయాగడ్, నువాపడా మరియు బొలంగీర్ ప్రాంతాల్లో వడగాలుల పరిస్థితులు నెలకొంటాయి. ఈనెల 6 నుంచి 8వ తేదీ మధ్య ఉత్తర ఒడిశా తీరం వెంబడి సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. ఈ వ్యవధిలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేట నివారించాలని వాతావరణ శాఖ సమాచారం ఆధారంగా ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయం హెచ్చరించింది.

ఐదు చోట్ల అభ్యర్థుల మార్పు

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని కాంగ్రెస్ జారీ చేసిన జాబితాలో అభ్యర్థుల్ని మార్చినట్లు ఆదివారం ప్రకటించింది. ఇంతవరకు నీలగిరి నియోజకవర్గం అభ్యర్థి పట్ల ఊగిసలాడిన పరిస్థితికి తెరదించింది. ఏఐసీసీ ఆమోదం మేరకు బాలాసోర్ జిల్లా నీలగిరి అసెంబ్లీ స్థానానికి అక్షయ ఆచార్య అభ్యర్థిత్వం ఖరారు చేసింది. ఇటీవల ప్రకటించిన ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను మార్చింది.

అభ్యర్థుల మార్పు ఇలా..

జలేశ్వర్, బొరీ, అలొమల్లిక్, అలొగొడా, పూరీ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ మార్చింది. ఏఐసీసీ విడుదల చేసిన తాజా జాబితా ప్రకారం శుక్రవారం కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి దేబాశిష్ నాయక్‌ను బొరీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దింపింది. దేబాశిష్ నాయక్ బీజేడీని వీడి బీజేపీలో చేరారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు టికెట్ నిరాకరించడంతో బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. జలేశ్వర్‌లో దేబీ ప్రసన్న చాంద్ స్థానంలో సుదర్శన్ దాస్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. అలొమల్లిక్ నుంచి బిజయానంద చౌలియా స్థానంలో హిమాన్షు చౌలియాను కాంగ్రెస్ ఖరారు చేసింది. మహబూబ్ అహ్మద్ ఖాన్ స్థానంలో సుదర్శన్ సాహూను అలొగొడా అసెంబ్లీ స్థానానికి ఎంపిక చేశారు. సుజిత్ మహాపాత్రా స్థానంలో పూరీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఉమా వల్లభ రథ్‌కు టిక్కెట్ ఇచ్చారు. పూరీ లోక్ సభ స్థానం నుంచి పోటీకి నిధుల కొరత కారణంగా సుచరిత మహంతి రేసు నుంచి వైదొలగడంతో కాంగ్రెస్ పూరీ లోక్‌సభ స్థానానికి జయ నారాయణ్ పట్నాయక్‌ను అభ్యర్థిగా ప్రకటించింది.

• మజ్జిగ వితరణ



వేసవిలో రైలు ప్రయాణికులకు ఉపశమనం కలిగించే మానవీయతతో స్థానిక సత్యసాయి సేవా సమితి కార్యకర్తలు ప్రయాణికులకు మజ్జిగ, శీతల పానీయం ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషను ప్లాట్‌ఫారాలపై ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు.

- భువనేశ్వర్

కుంద్రా సమితిలో ఫ్లాగ్ మార్చ్



కుంద్రాలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు

జయపురం: ప్రశాంత ఎన్నికల నిర్వహణ కోసం పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితిలో కెరిమెటా, లిమ్మ, కుంద్ర, రాణిగుడ గ్రామాల్లో ఇదివారం కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ చేశారు. జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ పాల్గొన్నారు. కుంద్ర సమితిలోన్ని కొన్ని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగవచ్చనే అభిప్రాయంతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలలో భయాందోళన తొలగించేందుకు కృషి చేస్తున్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్‌డీపీవో వర్మతో పాటు కుంద్ర పోలీసు అధికారి చిత్తరంజన్ ప్రధాన్, ఏజేఎస్ఐ మీనకేతన పాత్రో, పురుషోత్తమ రాయ్, సనాతన సునానితో పాటు పోలీసులు, 49 మంది బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

బీజేపీ సంకల్ప్ పత్రం ఆవిష్కరణ



బీజేపీ ఎన్నికల సంకల్ప్ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న జేపీ నడ్డా

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఆదివారం రాష్ట్ర బీజేపీ ఎన్నికల హామీల పత్రం (సంకల్ప్ పత్రం) ఆవిష్కరించారు. బిజూ జనతా దళ్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల కోసం సంకల్ప్ పత్రాన్ని విడుదల పురస్కరించుకుని బీజేడీ చేసిన వాగ్దానాలు ఇప్పటికీ నెరవేరలేదని బీజేపీ చీఫ్ పేర్కొన్నారు. బీజేపీ ఒడిశాలో ప్రతిపక్షంలో కూర్చోవడానికి కాదు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఈ ఎన్నికల్లో పోరాడుతుందన్నారు. రాష్ట్ర వేగవంతమైన, సమతుల్య అభివృద్ధిని నిర్ధారించడానికి బీజేడీని అధికారం నుంచి తొలగించాలని నడ్డా పిలుపునిచ్చారు. సాగునీటిని అందించడంలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో రైతుల ఆదాయం దేశంలోనే అత్యల్పంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేడీ ప్రభుత్వ ఉదాసీనత కారణంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుప్పకూలిందని నడ్డా ఆరోపించారు. ఉపాధ్యాయుల కొరత, విద్యా సంస్థల్లో అరకొర మౌలిక సదుపాయాల కారణంగా ఒడిశాలో పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్య భయంకరమైన స్థితిలో ఊగిసలాడుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయన్నారు. బీజేడీ నేతలు ఈ నేరాల్లో పాత్రదారులు కావడం దారుణమన్నారు.

రాష్ట్ర ప్రజలకు అన్యాయం..

దేశ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కేంద్రంలో బీజేపీ సర్కారు ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ యోజనను రాష్ట్రంలో అమలు చేయనందుకు నవీన్ పట్నాయక్ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాజకీయ కారణాల వల్ల రాష్ట్రంలో బిజూ జనతా దళ్ ఆయుష్మాన్ భారత్ పథకం అమలును తిరస్కరించింది. దీంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రజలు ఈ సౌకర్యాన్ని కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన మంత్రి ఆవాస్ యోజనను సక్రమంగా అమలు చేయడానికి రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం అనుమతించలేదని, ఫలితంగా చాలా మంది పేదలు ఈ పథకం కింద గృహ సౌకర్యాలను కోల్పోయారన్నారు. ప్రధానంగా రైతులు, మహిళలు, యువకులు, పేదలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సంకల్ప పత్రంలో పొందుపరిచిన హామీలను బీజేపీ అధ్యక్షుడు వివరించారు. రాష్ట్ర బీజేపీ జారీ చేసిన సంకల్ప పత్రం అత్యంత కీలకమైన పత్రంగా అభివర్ణించారు. ప్రజల నుంచి సేకరించిన లక్షలాది సూచనలతో సంకల్ప్ పత్రగా రూపుదిద్దుకుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో రాజకీయ సంస్కృతి మారిపోయిందని, ఇప్పుడు రాజకీయ సంస్కరణలు, అభివృద్ధి, జవాబుదారీ రాజకీయాలపై దృష్టి సారించబడుతుందన్నారు.

హోమ్ ఓటింగ్‌కు 4,000 మంది మొగ్గు



ఖుర్దా జిల్లాలో వృద్ధురాలికి ఇంటి నుంచి ఓటు సదుపాయం కల్పించిన జిల్లా అధికార యంత్రాంగం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఈనెల 13న జరగనున్న మొదటి దశ జంట ఎన్నికల్లో 4,000 మందికి పైగా ఓటర్లు ఇంటి నుంచి ఓటు (హోమ్ ఓటింగ్) వేయడానికి మొగ్గు చూపారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ చరిత్రలో తొలిసారిగా ఈ విధానం ప్రవేశ పెట్టడం విశేషం. ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌కు రాలేని ఓటర్ల కోసం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇంటి ముంగిట ఓటువేసే సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 85 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వయోవృద్ధ ఓటర్లు, 40 శాతం పైబడి శారీరక వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచి ఓటింగ్‌లో పాల్గొనవచ్చు. నిబంధన ప్రకారం అటువంటి ఓటర్లు స్థానిక అధికార యంత్రాంగం ఏర్పాటు చేసే వాహనంలో పోలింగ్ బూత్‌కు రావచ్చు లేదా ఇంటి నుంచే ఓటింగ్‌ను ఎంచుకోవచ్చు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒడిశాలో మొదటి దశ ఓటింగ్‌లో మొత్తం 4,158 మంది ఓటర్లు ఇంటి నుంచి ఓటు సౌకర్యం ఎన్నుకున్నారు. వీరిలో 85 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న 2,196 మంది వయోవృద్ధ ఓటర్లు, 1,962 మంది 40 శాతం పైబడిన వైకల్యం కలిగిన దివ్యాంగులు ఉన్నారు. తొలి దశలో నాలుగు లోక్ సభ నియోజకవర్గాలైన కలహండి, నవరంగ్‌పూర్, కొరాపుట్, బరంపురంలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని 28 అసెంబ్లీ సెగ్మెంట్లలో 4,158 మంది ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసేందుకు మొగ్గు చూపారు. రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న ఇంటి నుంచి ఓటు వేయనున్న ఓటర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈవో నికుంజ బిహారీ ధొలో అభినందించారు.

భగ్గుమంటున్న సూరీడు

- తీవ్ర ఎండలతో ప్రజలు విలవిల
- 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



ముఖాలకు ముసుగులు వేసుకొని వెళ్తున్న యువత



కేకే కళాశాల రోడ్డులో చల్లని పానీయాలు తాగుతున్న జనం



బరంపురం నగరంలో గొడుగులు వేసుకొని వెళ్తున్న జనం

భానుడు భగ్గుమంటున్నాడు. తీవ్రమైన ఎండలతో జనం విలవిల్లాడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి నమోదవుతుండడంతో ఇళ్ల నుంచి బయటకు రావటానికి ఎవరూ సాహసం చేయడం లేదు. గంజాం జిల్లాలో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండ తీవ్రతతో ఉదయం 11 గంటలకే జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం సుమారు 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. చిల్లర వ్యాపారులు ఎండ వేడిని తట్టుకోలేక దుకాణాలు మూసేస్తున్నారు. ఎండ నుంచి సేద తీరటానికి శీతల పానీయాలు, ఫ్రూట్, చెరకు రసం, కర్బూజ పండ్లను తీసుకుంటుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది.

-బరంపురం

క్లుప్తంగా

కింగ్‌కోబ్రా హల్‌చల్



పట్టుబడిన కింగ్ కోబ్రా

మల్కన్‌గిరి: కలిమెల సమితి కంగుర్‌కొండ పంచాయతీ ఎం.వి 126 గ్రామంలో 8 అడుగుల కింగ్ కోబ్రా ఆదివారం హల్‌చల్ చేసింది. స్థానికులు వెంటనే కలిమెల అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వాడ్రాఫ్ బృందాన్ని తీసుకువచ్చారు. మూడు గంటలపాటు కష్టపడి అతికష్టం మీద పట్టుకున్నారు. సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు. ఎండకు ఇలా బయటకువస్తున్నాయని తెలిపారు

గూడ్స్ రైలు ఇంజిన్‌పై బండరాళ్లు



రైలు మార్గంలో రైలు ఇంజిన్‌పై పడిన బండరాయి

జయపురం: విశాఖపట్నం – కిరండూల్ రైలు మార్గంలో ఆంధ్రప్రదేశ్‌లోని శివలింగపురం సమీపంలో బండరాయి కొండపై నుంచి గూడ్స్ ఇంజిన్‌పై బండరాళ్లు పడడంతో ఇంజిన్ పట్టాలు తప్పినట్లు సమాచారం. దీంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు ఆదివారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా విశాఖపట్నం– అరుకు, కొరాపుట్‌లకు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు.

బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు ఆత్మహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ



శ్రీదేవి సశ్మాల్(ఫైల్)

ఇచ్ఛాపురం: పట్టణంలో పెద్దాకుల వీధిలో లీలా బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్న శ్రీదేవి సశ్మాల్ (43) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఇంట్లో తలెత్తిన చిన్న గొడవ కారణంగా శ్రీదేవి మనస్థాపానికి గురైంది. బెడ్‌రూమ్‌లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమెకు భర్త ప్రమోద్ సశ్మాల్, కుమారులు జోగేష్, ప్రిన్స్ ఉన్నారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇచ్ఛాపురం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ స్లిప్పు లేదా.. టెన్షన్ వద్దు

హిరమండలం: ఎన్నికలు సమీపిస్తున్న వేల బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే కార్యక్రమం మొదలుపెట్టారు. అయితే ఓటరు స్లిప్పులు లేకున్నా ఓటేసే అవకాశం ఉంది. ఎన్నికల రోజు బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. వారి వద్దకు వెళ్లి ఓటరు స్లిప్పులు పొందవచ్చు. లేకపోతే ఓటరు జాబితాలో క్రమ సంఖ్య తెలుసుకుని పోలింగు ఏజెంట్లకు చెప్పి వారికి తానే సంబంధిత ఓటరని నిరూపించుకునే గుర్తింపు కార్డును చూపి ఓటేయచ్చు. లేదంటే పోలింగు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే జాబితాలను పరిశీలించి పేరు ,క్రమ సంఖ్యను కాగితంపై రాసుకుని వెళ్లవచ్చు. ఆ సమయంలో ఓటరు తగిన గుర్తింపు కార్డును తప్పకుండా వెంట తీసుకువెళ్లి పోలింగు కేంద్రంలో ఉండే అధికారులను చూపించి ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

7, 8 తేదీల్లోనూ పోస్టల్ ఓటు వేసే అవకాశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కచ్చితంగా వినియోగించుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశామ ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కొందరు ఎన్నికల సిబ్బంది 4, 5, 6 తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోలేకపోతే 7, 8వ తేదీల్లో ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో ఓటు వేయవచ్చని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించామని పేర్కొన్నారు.

కొట్‌పాడ్‌లో త్రిముఖ పోటీ!

- పోటీలో ఉన్నది ఆరుగురు



చంద్రశేఖర మఝి (బీజేడీ)



అనూప్ దియాన్ (కాంగ్రెస్)



రూపు భొత్ర (బీజేపీ)

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల బరిలో ఆరుగురు అభ్యర్థులు ఉన్నారు. అయితే ప్రధాన పోటీ బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనేని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున అనూప్ దియాన్ తొలిసారిగా ఎన్నికల బరిలో దిగారు. బీజేడీ అభ్యర్థి చంద్ర శేఖర మఝి 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. తరువాత బీజేడీలో చేరి..ఇప్పుడు అదే పార్టీ తరఫున అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థిగా రూపు భొత్ర తొలిసారిగా పోటీ చేస్తున్నారు. వారితో పాటు ఇండిపెండెంట్లుగా రామకృష్ణ పూజారి, కేతన సమర్థ, దూవతీ గదబ కూడా పోటీ చేస్తున్నారు. దేశంలో సాధారణ ఎన్నికలు 1952 నుంచి జరుగుతున్నా కొట్‌పాడ్ నియోజకవర్గం మాత్రం 1961లో ఏర్పాటైంది. కొట్‌పాడ్, బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధి ప్రాంతాలను కలిపి కొట్‌పాడ్ ఎస్టీ నియోజకవర్గం ఏర్పాటైంది. ఆనాటి నుంచి ఈ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. అనంతరం 1977లో ఈ నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. ఈ నియోజకవర్గంలో కొట్‌పాడ్, కుంద్రా సమితిలతో పాటు బొరిగుమ్మ సమితిలోని 11 గ్రామ పంచాయతీలు(డెంగాపొదర్, అవులి, మల్ల, ససపారియ, జుజారి, కమర, పండాసుగుడ, శౌశాహండి, కనాగాం, అంచల, బిజాపూర్ పంచాయతీలు)తో పాటు బొయిపరిగుడ సమితిలో ఏడు గ్రామ పంచాయతీలైన గుప్తేశ్వర్, రామగిరి, దండాబడి బలిగాం, కటపడ, మహిగుడ, తెంతులిగుమ్మ పంచాయతీలను చేర్చారు. ఈ నియోజకవర్గంలో 1961 నుంచి 2019 వరకు జరిగిన 14 ఎన్నికల్లో కాంగ్రెస్ 11 ఎన్నికల్లో విజయం సాధించింది. 1971లో స్వతంత్ర పార్టీ అభ్యర్థి ధన్‌సాయి రొంధారి గెలుపొందగా 1990లో జనతా దల్ పార్టీ అభ్యర్థి సదన నాయిక్ విజయం సాధించారు. అనంతరం 33 ఏళ్ల తరువాత బీజేడీ మొదటిసారి విజయం సాధించింది. ఆ మధ్య కాలంలో జరిగిన అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. 1961లో కాంగ్రెస్ అభ్యర్థి మహదేవ్ బారిక్ గెలపొందారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి సూర్యనారాయణ మఝి విజయం సాధించారు. 1971లో స్వతంత్ర పార్టీ అభ్యర్థి రొంధారి గెలిచారు. 1974 నుంచి (1990లో తప్పా) 2009 వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో ఎనిమిదిసార్లు బాసుదేవ్ మఝి విజయం సాధించి ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారు. అనంతరం బాసుదేవ్ మఝి అనారోగ్యంతో మరణించారు. నిస్వార్థపరుడుగా ఆయనకు పేరుంది. ఆయన మరణానంతరం 2014లో జరిగిన ఎన్నికలలో బాసుదేవ్ మఝి సోదరుడు చంద్ర శేఖర మఝి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప బీజేడీ అభ్యర్థి అశోక్ కుమార్ పంగిని దాదాపు 32 వేల ఓట్ల ఆధిక్యతతో ఓడించారు. ఆ ఎన్నికలలో చంద్రశేఖర మఝికి 71,018 ఓట్లు రాగా మాజీ ఎంపీ జయరాం పంగి కుమారుడు అశోక్ పంగికి 39,697 ఓట్లు వచ్చాయి. వారితో తలపడిన బీజేపీ అభ్యర్థి 20,699 ఓట్లు పోలయ్యాయి. అయితే చంద్రశేఖర తన అన్న బాసుదేవ్ మఝి వలే ప్రజల ఆదరణ పొందలేకపోయారు. 2019లో జరిగిన ఎన్నికలలో ఆయన ఓట్ల శాతం తగ్గింది. అంతే కాకుండా బీజేడీ అభ్యర్థిని పదిృణీ దియాన్ చేతిలో కేవలం 2,630 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆ ఎన్నికలలో బీజేడీ అభ్యర్థిని దియాన్‌కు 62,248 ఓట్లు రాగా 2014 ఎన్నికలలో 71,018 ఓట్లు పొందిన చంబదశేఖర మఝికి 2019 ఎన్నికల్లో 59,617 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ఖగేశ్వర్ పూజారికి 36,366 ఓట్లు వచ్చాయి. మొదటి ఓటమికే కలత చెందిన చంద్రశేఖర మఝి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేడీలో చేరారు. నేడు ఆయన బీజేడీ అభ్యర్థిగా బరిలో దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిగా అనూప్ దియన్, బీజేపీ అభ్యర్థిగా రూపు భొత్రలు తలపడుతున్నారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ, బీజేడీ మధ్యనే పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

జోరుగా బీజేడీ ప్రచారం



నెక్కంటికి నీరాజనాలు పలుకుతున్న మహిళలు



జేకేపూర్‌లో ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అధికార బీజేడీ పార్టీ ఎన్నికల ప్రచార వేగాన్ని పెంచింది. రాయగడ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని చందిలి, కర్లకొన పంచాయతీల్లోని జేకేపూర్, కర్లకొన, చందిలి తదితర ప్రాంతాల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆదివారం ముమ్మరంగా ప్రాచారం చేశారు. అడుగడుగునా ఆయనకు మహిళలు నీరాజనాలు పలికారు. ముందుగా జేకేపూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న నెక్కంటి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ ఎన్నికలు చాలా కీలకమని అన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతిఓటు అభివృద్ధికి నాంది పలుకుతోందన్నారు. అందువల్ల ఆచితూచి ఓటు వేయాలని.. అభివృద్ధి అంటే ఏమిటో అర్థం చెప్పిన బీజేడీ పార్టీ అభ్యర్థులకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

ఎన్‌ఏసీగా చందిలి పంచాయతీ

జనాభా పరంగా అభివృద్ధి చెందిన చందిలి పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఎన్‌ఏసీగా ప్రకటించారని భాస్కరరావు గుర్తు చేశారు. ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి దిశవైపు అడుగిడుగుతున్న చందిలి ఎన్‌ఏసీగా గుర్తింపు పొందడంతో మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతీ గ్రామానికి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయంగా బీజేడీ పని చేస్తుందని వివరించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో రాయగడ శాసనసభ స్థానంలో ఈసారి ఎలాగైనా బజేడీ జెండా ఎగురవేయాలని.. అందుకు మీ అందరి ఆశీర్వాదం అవసరమని అన్నారు. ర్యాలీలో బీజేడీ జిల్లా కార్యదర్శి దూడల శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సొంతగూటికి కాశీనగర్ ఎన్‌ఏసీ చైర్‌పర్సన్ సుధారాణి



బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్ సమక్షంలో పార్టీలో చేరిన సుధారాణి

పర్లాకిమిడి: ఇటీవల బీజేపీలో చేరిన గజపతి జిల్లా కాశీనగర్ ఎన్‌ఏసీ చర్‌పర్సన్ మేడిబోయిన సుధా రాణి తిరిగి ఆదివారం బీజేడీ పార్టీలో చేరారు. ఏప్రిల్ 23న కాశీనగర్‌లో జరిగిన బీజేపీ మిశ్రణ్ పర్వ్‌లో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ప్రదీప్ పాణిగ్రాహి సమక్షంలో కాషాయం కండువా కప్పుకున్నారు. అనంతరం పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు నామినేషన్ ర్యాలీలో ప్రముఖంగా కనిపించారు. ఆమెతో పాటు కాశీనగరం బీజేడీ ఉపాధ్యక్షులు రోక్కం సతీష్, రోక్కం రాంప్రసాద్ (జ్యోతి) తదితరులు కూడా బీజేపీ కండువాలు కప్పుకున్నారు. ఇంతలోనే ఆదివారం సాయంత్రం బీజేడీ పార్టీ మిశ్రణ్ పర్వ్‌లో సుధారాణి పాల్గొని శంఖం చేతబట్టింది. బీజేడీ అధికారంలోకి వస్తే సముచిత స్థానం ఇస్తామని అధిష్టానం చెప్పడంతో తిరిగి సొంతగూటికి చేరినట్టు సమాచారం. మిశ్రణ్ పర్వ్‌లో బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్, మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, కాశీనగరం ఎన్‌ఏసీ వైస్ చైర్మన్ రఘురాం సాహు, పార్టీ సమితి అధ్యక్షులు సీహెచ్ లోకనాథం, తిరుపతి పాణిగ్రాహి, బసంత్ దాస్, వి.ఎస్.ఎన్.రాజు ఉన్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేసేందుకు సిద్ధమైన ఒక వ్యక్తిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అరెస్టైన వ్యక్తి బీహార్‌కు చెందిన అజయ్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. రైల్వే పోలీసు డీఎస్పీ నిరంజన్ పాఢి ఆదేశాల మేరకు జీఆర్పీ ఐఐసీ బిజయ్ కుమార్ బెక్ నేతృత్వంలో శనివారం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం 1లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక బ్యాగుతో ప్రయాణికుడు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు. దీంతో బ్యాగులో 30 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అంచనా. కొరాపుట్ నుంచి బిహార్‌కు అక్రమంగా ఈ గంజాయిని రవాణా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది.

14 కిలోల గంజాయి పట్టివేత..

మల్కన్‌గిరి: సత్తిగూడ కూడలి వద్ద ఆదివారం మధ్యాహ్నం జిల్లా ఎక్సైజ్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. బస్సు కోసం ఇద్దరు వ్యక్తులు వేచి ఉండటం చూశారు. వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులో గంజాయి లభ్యమైంది. ఇద్దరినీ విచారించారు. బీహార్‌కు తరలించేందుకు 14 కేజీల గంజాయిని కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. బీహార్‌కు చెందిన దేవ్‌రామ్, అతూల్ అలంపై కేసు నమోద్ చేశారు. సోమవారం కోర్టుకు తరలిస్తామని మల్కన్‌గిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ కుమార్ బాల తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.2.30 వేలు ఉంటుందన్నారు

8న రాయగడకు రాజ్‌నాథ్‌సింగ్



రాయగడ: కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల ఎనిమిదో తేదీన రాయగడ రానున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు న్యూఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచిబయలు దేరి ఉదయం 11.05 గంటలకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయిపూర్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు రాయిపూర్ నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో కలహండి జిల్లాలోని భవానీపట్నం చేరుకుంటారు. అక్కడ గల ఎల్‌బీఎస్ స్టేడియంలో మధ్యాహ్నం 12.55 గంటలకు జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. కలహండి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలవిక కేశరి దేవ్, అసెంబ్లీ అభ్యర్థి అర్తతరణ మహాపాత్రో తరఫున రాజ్‌నాథ్ సింగ్ ప్రచారం చేస్తారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.20 గంటలకు రాయగడ చేరుకొని ఐఏసీఆర్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ,ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పలాస జీఆర్‌పీ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో దిగువ లైన్ రైలుపట్టాలపై సుమారు 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. నీలం షర్టు, నలుపు లుంగీ ధరించి ఉన్నాడు. గుర్తు తెలియని ఢీకొట్టడంతో మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు పలాస రైలు నిలయంలో ఉన్న జీఆర్‌పీ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : నరాల బలహీనత వ్యాధితో మానసికంగా బాధపడుతూ మతిస్థిమితం తగ్గి నగరంలోని ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న టేకి కుమారి భర్త ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఉంటోంది. కుమార్తెకు వివాహమవ్వడంతో పెద్దకుమారుడు శంకర్, కోడలు, చిన్న కుమారుడు సంతోష్‌కుమార్‌లతో ఏపీ హెచ్‌బీ కాలనీలో ఉంటున్నారు. సంతోష్‌కుమార్(28) వార్డు నెంబరు 30లో వలంటీర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవలే రాజీనామా చేశాడు. మూడేళ్లుగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా నయం కాకపోవడంతో ఆదివారం సాయంత్రం తన బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సంతోష్‌కుమార్ తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ముగ్గురికి షోకాజ్ నోటీసులు

శ్రీకాకుళం పాత బస్టాండ్ : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా ముగ్గురు ఉన్నతాధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నరసన్నపేటలో శనివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులకు తావిచ్చిన కారణంగా వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు, 24 గంటల్లో నోటీసులపై స్పందించి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నరసన్నపేట రిటర్నింగ్ అధికారి, మెప్మా పీడీ, పోస్టల్ బ్యాలె ట్ ఫెసిలియేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సారవకోట త హసీల్దార్ షోకాజ్ నోటీసులు అందుకున్నారు.

'ఎంపీలకు పట్టని అభివృద్ధి'



పర్లాకిమిడిలో ర్యాలీ చేస్తున్న చంద్రశేఖర నాయిడు

పర్లాకిమిడి: బరంపురం పార్లమెంటరీ స్థానం నుంచి గతంలో ఎంపీలుగా పని చేసిన వారు లోకసభలో గంజాం, గజపతి ప్రాంతాల సమస్యలను ఎప్పుడైనా ప్రస్తావించారా అని త్వరలో జరగనున్న ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న వి.చంద్రశేఖరనాయుడు ప్రశ్నించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బరంపురం ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా చంద్రశేఖరనాయుడు పోటీ చేసి చంద్రశేఖర సాహు చేతిలో ఓడిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గజపతి జిల్లా మోహానా, చాందిపుట్ నుంచి పర్లాకిమిడి విచ్చేసి రాజవీధిలో గజపతి ప్యాలస్ వద్ద నుంచి స్థానిక ప్రజలతో పట్టణంలో ఆదివారం ర్యాలీ జరిపారు. అనంతరం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో మార్పు, పరివర్తన రావాలి అని అన్నారు. మనకు బుల్లెట్ రైళ్లు అవసరం లేదని.. అభివృద్ధి కావాలని అన్నారు. తాను పర్లాకిమిడి వస్తున్నప్పుడు ఆర్.ఉదయగిరి, చాందిపుట్ గ్రామాల్లో మంచినీటి కోసం మహిళలు ఆందోళన చేస్తుండడం ఆవేదన కలిగించిందన్నారు. పర్లాకిమిడిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఉందన్నారు. తనను గెలిపిస్తే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

టీడీపీలో చేరిన నేతను నిలదీసిన గ్రామస్తులు



బావాజీనాయుడును నిలదీస్తున్న యువకులు, మహిళలు

నరసన్నపేట: మండలంలోని నర్సింగిబిల్లిలో వైఎస్సార్ సీపీ నుంచి మరో పార్టీకి వెళ్లిన పంగ బావాజీ నాయుడుకు ఆదివారం చేదు అనుభవం ఎదురైంది. మారిన పార్టీ తరఫున స్థానిక టీడీపీ నాయకుడు పాగోటి అప్పలనాయుడుతో కలసి కరగాం పంచాయతీలోని పెద్ద కరగాం ప్రచారం నిమిత్తం బావాజీనాయుడు రాగా గ్రామ మహిళలు, యువకులు నిలదీశారు. వైఎస్సార్ సీపీని ఎందుకు వీడావు.. మాకు ఎందుకు సంప్రదించలేదు.. అంతా నీ ఇష్టమేనా.. నువ్వు ఏ పార్టీలో ఉంటే మేం ఆ పార్టీలో ఉండాలా.. మా అభిప్రాయాలకు ప్రాధాన్యత లేదా.. అని నిలదీశారు. ఏ ముఖం పెట్టుకొని మరో పార్టీ తరఫున ఓట్లు అడగడానికి వచ్చావని ప్రశ్నించారు. తమకు వైఎస్సార్ సీపీ పాలనలోనే మేలు జరిగిందని, తామంతా ఈ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. పంగబావాజీ నాయుడుకు వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో గౌరవమైన పదవి లభించింది. ఆయన భార్య పంగ కృష్ణవేణికి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవి కల్పించారు. అయినా పార్టీని వీడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పూరీ కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహం

- అభ్యర్థి మార్పుతో జిల్లా కార్యాలయంలో సామగ్రి ధ్వంసం



పూరి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సామగ్రిని ధ్వంసం చేస్తున్న కార్యకర్తలు

భువనేశ్వర్: పూరీ సదర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిని ఏఐసీసీ మార్చడంతో పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడ్డారు. పూరీ సదర్ అసెంబ్లీ స్థానానికి తొలుత సుజిత్ మహాపాత్రో పేరును కాంగ్రెస్ ప్రతిపాదించింది. ఈ నియోజకవర్గం అభ్యర్థిని మార్చినట్లు ఆదివారం సవరణ జాబితా విడుదల చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ సుజిత్ మహాపాత్రో స్థానంలో పార్టీ సీనియర్ నేత ఉమా వల్లభ రథ్‌ని ప్రకటించింది. ఈ మార్పు సుజిత్ మహాపాత్రో అనుచరులు, మద్దతుదారులకు ఆగ్రహం తెప్పించింది. ఏఐసీసీ మార్పు ప్రకటించే సరికి సుజిత్ మహాపాత్రో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆగ్రహించిన మద్దతుదారులు పూరీ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ పోస్టర్లు, జెండాలను చించివేసి, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఏఐబీఈఏ కార్యదర్శి రాంబాబు

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజలందరిపైనా ఉందని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) కార్యదర్శి బి.ఎస్.రాంబాబు అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీయూబీఈఏ) శ్రీకాకుళం రీజియన్ రీజనల్ కాన్ఫరెన్స్ రీజనల్ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులుగా 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందం పూర్తయినందున కేంద్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం ఎన్నికల తర్వాత బ్యాంక్‌ల ప్రయివేటీకరణకు తెరతీస్తే బ్యాంకింగ్ రంగంలోని తొమ్మిది సంఘాలు కలిసి నిరవధిక సమ్మెకు పిలుపునిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థకు కట్టుబడి ఉండాలని, ఈ మేరకు ఒక ప్రకటన చేయాలని కోరారు. యూనియన్ బ్యాంక్ శ్రీకాకుళం రీజియన్ రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్ మాట్లాడుతూ శ్రీకాకుళం రీజియన్ పరిధిలో 56 బ్రాంచిలు ఉన్నాయని, సుమారు రూ.7,632 కోట్లు వ్యాపారం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏపీయూబీఈఏ అధ్యక్షుడు కాలె శ్రీనివాసరావు, ఏపీయూబీఈఏ ప్రధాన కార్యదర్శి వి.ఉదయ్‌కుమార్, ఏఐయూబీఈఏ ప్రధాన కార్యదర్శి ఎన్.శంకర్, యూనియన్ ప్రతినిధులు పి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, జి.కరుణ, లక్ష్మీపతి, పి.సుమన్, కె.మోహనరావు, అనిల్, సూర్యకిరణ్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, శ్యాం, వసంతరావు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై దుష్ప్రచారం

- వైఎస్‌ఆర్ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమల్లోకి వస్తుందని టీడీపీ దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్ఆర్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ చట్టం అమలు చేయలేదని, కేంద్ర ప్రభుత్వం నీతిఆయోగ్ ద్వారా సూచించిందని, ఆ విషయాన్ని టీడీపీ విస్మరించి అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజాక్షేత్రంలో గెలిచే సత్తాలేక అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేకమైన ఏ చట్టాన్నయినా వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమల్లోకి తీసుకురారని, ఇది సామాన్య ప్రజలకు కూడా తెలుసుని పేర్కొన్నారు. రాష్ట్ర స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వారు సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ కోసం సర్క్యులర్ జారీ చేస్తే దాన్ని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు ఆపాదిస్తూ టీడీపీ సోషల్ మీడియాలో, బహిరంగ సభలు, ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి ప్రచారాలను వైఎస్ఆర్ సీపీ లీగల్ సెల్ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. వాస్తవానికి టీడీపీ కూటమిలో ఈ చట్టం దొంగలు ఉన్నారని, అది వారు గుర్తించాలన్నారు. నీతి ఆయోగ్ ద్వారా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ఉండాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని, ఆ విషయాన్ని టీడీపీ నాయకులు ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని మొట్టమొదటి సారిగా కేంద్ర ప్రభుత్వం 1989లో ప్రతిపాదన చేయగా, ఆ తర్వాత వచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నీతిఆయోగ్ ద్వారా దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో యాక్ట్ ను అమలు చేయమని ప్రతిపాదించిందన్నారు. అయితే న్యాయవాద సంఘాలనుంచి అభ్యంతరాలు రావడంతో నిలిపివేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన నీట్



విజయనగరం అర్బన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నేషనల్ ఎంట్రెన్స్ అండ్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నీట్) జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 571 పట్టణాల్లోనూ, 14 బోర్డు సిటీలలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్‌ను నిర్వహించింది. జిల్లా కేంద్రంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,727 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 40 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో బాలికలు 1,282 మంది, బాలురు 405 మంది ఉన్నట్టు పరీక్షల నిర్వహణ జిల్లా కో–ఆర్డినేటర్ రవి కె.మండా తెలిపారు.

మల్లన్నా దీవించు

భామిని: మండలంలోని ఎం.కె.పురంలో వెలసిన శ్రీ ఎండల మల్లికార్జున స్వామి సన్నిధిలో పాలకొండ శాసనసభ్యురాలు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ మొక్కు తీర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఉన్నారు.

గిరిజన మ్యూజియానికి
కొత్త హంగులు



అందంగా తీర్చిదిద్దుతున్న ఆదిమానవుడి బొమ్మ



డైనోసర్ల చిత్రాలు

సీతంపేట: టీడీపీ ప్రభుత్వం హయంలో ఆగిపోయిన గిరిజనమ్యూజియం పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునఃప్రారంభించింది. ఈ మేరకు సీతంపేటలోని పాత పీఎంఆర్‌సీలో మ్యూజియం పనులు జరుగుతున్నాయి. రూ.కోటి అంచనా వ్యయంతో గిరిజన మ్యూజియం నిర్మించడానికి నిధులు కేటాయించారు. 2017లో ఈ మ్యూజియానికి శంకుస్థాపన జరిగినా సక్రమంగా నిధులు కేటాయించకపోవడం, టీడీపీ ప్రభుత్వం పట్టించుకోని కారణంగా పనులు నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్ల క్రితం ఈ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఆదిమానవుడి దగ్గర నుంచి ఇప్పటివరకు జరిగిన మార్పులను చిత్రాల రూపంలో తయారు చేస్తున్నారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల తోపాటు సీతంపేట ఏజెన్సీలో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, బీహార్‌లలో ఉన్న ఆదివాసీలు, ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉండే ఆదివాసీల జీవన విధానం కంటికి కనిపించేలా బొమ్మల రూపంలో చూపించాలని నిర్ణయించారు. గిరిజనులు ఇంట్లో వాడే వస్తువులు, కట్టుబొట్లు, వేటాడే వస్తువులు, పూర్వం నుంచి ఇప్పటివరకు దశలవారీగా మారిన మార్పులను చిత్ర రూపంలో ప్రదర్శించేందుకు బొమ్మలను సేకరించారు. ప్రస్తుతానికి రెండు బ్లాకుల్లో పనులు జరిగాయి. మ్యూజియం బయట కొత్తగా కొన్ని దుకాణ సము దాయాలను ఏర్పాటు చేశారు. గిరిజన మ్యూజి యం పూర్తయితే పర్యాటకంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందినట్లవుతుంది.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

- వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



శివ్వాం గ్రామంలో ఎన్నికల ప్రచారం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొత్తూరు, శివ్వాం, గొట్టివలస, గొల్లవానివలస, తులసిరామినాయుడు వలస, ఉల్లిభద్ర గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆమెకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, ఆయన పాలనలో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. పేదల అభ్యున్నతే ప్రధానంగా అమలు చేసిన పథకాలతో ఎంతోమంది జీవితాల్లో సంక్షేమ వెలుగులు నెలకొన్నాయన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా మోసపూరిత హామీలతో ప్రజలను మాయ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తుంటారని, ఆయనను నమ్మితే రాష్ట్ర ప్రజల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు.

గెలుపు పార్టీలో.. చేరికల జోరు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు జోరందుకున్నాయి. విజయనగరంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న పలువురు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో గౌరీ సేవా సంఘ మాజీ అధ్యక్షుడు ఆదారి నాగు, గౌరీ సేవా సంఘం జిల్లా సెక్రటరీ మొల్లేటి నాయుడు, ఆదారి బాసులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కోలగట్ల వీరభద్ర స్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు..



పార్టీలో చేరిన లక్కవరపుకోట మండలం కొట్యాడ గ్రామానికి చెందిన యూత్ సభ్యులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: కొత్తవలస, లక్కవరపుకోట మండలాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. లక్కవరపుకోట మండలం కొట్యాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 30 మంది యూత్ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. వీరందరికి కడుబండి శ్రీనివాసరావు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే కొత్తవలస మండలం పాతసుంకరపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 25 కుటుంబాలువారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ యర్రా శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, పెదిరెడ్ల సూరిబాబు, వెంకన్నపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో రాష్ట్రం..



పూసపాటిరేగలో వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకుపోతుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. పూసపాటిరేగ గ్రామానికి చెందిన 50 కుటుంబాలు.. కనిమెల్లకు చెందిన 30 కుటుంబాలు టీడీపీ, జనసేనను వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ బడ్డుకొండ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుబడిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, కోరాడ సత్యనారాయణ, మహంతి లక్ష్మణరావు, ఎస్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, నడిపేన రమణ, కోరాడ కాశి, కోరాడ అరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలు కుటుంబాల చేరిక



గోభ్యాంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని గోభ్యాంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సమక్షంలో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారందిరకీ అప్పలనరసయ్య పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బొత్స అప్పలనరసయ్యను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గెదేల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, బీసీ సెల్ జిల్లా నాయకులు మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ వంగపండు లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొత్స ఆధ్వర్యంలో ..



పార్టీలో చేరిన కొఠారుబిల్లి వాసులతో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ వేమలి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పొనుగుటివలసలో ..



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. గ్రామానికి చెందిన యందవ ఆనంద్ ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే తమ లక్ష్యమని పార్టీలో చేరిన వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ సచివాలయ కన్వీనర్ శాసపు వేణుగోపాలనాయుడు, మాజీ సర్పంచ్ శాసపు కేశవనాయుడు, రెడ్డి రమేష్, కెంబూరి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ జోరు కొనసాగనీ...



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని ముత్తాయవలస నుంచి 35 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ పిల్లా వసుంధర, ఉప సర్పంచ్ బొద్దల లక్ష్మీ వెంకటనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ సంబరాలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మకు భక్తులు ఆదివారం సంబర నిరాజనాలు పలికారు. చల్లని తల్లికి ముర్రాటలతో మొక్కులు చెల్లించేందుకు కాలినడకన దేవస్థానంకు చేరకున్నారు. పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు, నూతన దంపతులు ఘటాలు, ముర్రాటలతో ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేశారు.

పోస్టల్ బ్యాలెట్లకు 7, 8 తేదీల్లో మరో అవకాశం

విజయనగరం అర్బన్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు ఈ నెల 7, 8 తేదీల్లో మరో అవకాశాన్ని ఇస్తున్నట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ విజయనగర గురజాడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆదివారం సందర్శించారు. ఓటింగ్‌కు చేసిన ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియ, హెల్ప్ డెస్కులు, క్యూలైన్లు, పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడి వారి సమస్యలను, ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జిల్లాలో పోస్టల్ ఓటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను, ఎన్నికలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా మీనా మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పోస్టల్ ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు, ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వారు సైతం తమ ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును సంబంధిత ఫెసిలిటేషన్ సెంటర్‌కు తీసుకెళ్లి ఓటు పొందవచ్చన్నారు. ఇలాంటి వారి కోసం ఈ నెల 7, 8 తేదీల్లో ఓటు వేయడానికి అవకాశం ఇస్తామని తెలిపారు. వివిధ విభాగాల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని, సీ-విజిల్ యాప్‌లో ఎక్కువ ఫిర్యాదుల అందుతున్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోని మద్యం అక్రమంగా రాకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 12,400 సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎస్‌డి.అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ్‌చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఎ.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి.. ప్రభుత్వం భరోసా..



కొట్టాం పీహెచ్‌సీ



రాకోడు పీహెచ్‌సీ కాన్పుగదిలో డెలివరీ టేబుల్

- పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు
- అన్ని వసతులు కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అన్ని పీహెచ్‌సీలను 24 గంటల పీహెచ్‌సీలుగా మార్పు
- ఐదేళ్లలో 83 లక్షల మందికి సేవలు
- 24.46 లక్షల వైద్య పరీక్షలు

విజయనగరం ఫోర్ట్: జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీహెచ్‌సీల్లో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. గతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలకు) ప్రస్తుత పీహెచ్‌సీలకు చాలా తేడా ఉంది. 2019కు ముందు పీహెచ్‌సీలు అధ్వానస్థితిలో ఉండేవి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు – నేడు ద్వారా పీహెచ్‌సీల రూపురేఖలు మార్చేశారు. మౌలిక వసతులు కూడా కల్పించారు. అదనపు సిబ్బందిని నియమించడంతో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు..

గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీలో ఒక వైద్యుడు మాత్రమే ఉండేవారు. దీంతో ఆ వైద్యుడు ఏదైనా పనిమీద సెలవు పెడితే రోగులకు వైద్యసేవలు అందేవి కావు. అటువంటి పరిస్థితి ఉండకూడదని భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను నియమించారు. దీంతో ఒక వైద్యుడు సెలవులో ఉన్నా మరో వైద్యుడు రోగులకు అందుబాటులో ఉంటాడు. అదే విధంగా ఒక స్టాఫ్‌నర్స్ గతంలో ఉంటే ఇప్పుడు ముగ్గురిని నియమించారు. అదేవిధంగా ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలను నియమించారు. గతంలో రెండు, మూడు పీహెచ్‌సీలకు ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఉండేవాడు. ప్రస్తుతం ప్రతి పీహెచ్‌సీకి ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నారు. గతంలో 5,10 పీహెచ్‌సీలు మాత్రమే 24 గంటలు పని చేసేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని పీహెచ్‌సీలను 24 గంటల పీహెచ్‌సీలుగా మర్చారు. గతంలో కొన్ని పీహెచ్‌సీల్లో మాత్రమే ప్రసవాలు జరిగేవి. ఇప్పుడు అన్ని పీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు నిర్వహిస్తున్నారు. ప్రసవాల నిర్వహణకు అవసరమైన కాన్పు గదులను ఆధునీకరించారు. నాడు – నేడు ద్వారా ఆస్పత్రులకు కొత్తగా పెయింటింగ్స్ వేసి అందంగా తీర్చిదిద్దారు. రాత్రి వేళ కూడా పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గతంలో 10 నుంచి 14 రకాల వైద్య పరీక్షలు మాత్రమే చేయగా.. ప్రస్తుతం 63 రకాల పరీక్షలు చేస్తున్నారు.

నాణ్యమైన వైద్యం అందించారు..



దగ్గు, గ్యాస్టిక్ సమస్య ఉందని కొట్టాం పీహెచ్‌సీకి వెళ్లాను. అక్కడ వైద్యులు నా సమస్యను ఓపికగా విని మందులు, టానిక్ ఇచ్చారు. డాక్టర్ గారు నాతో ఆప్యాయంగా మాట్లాడారు.
– బి. ప్రసాద్, వినినిగిరి గ్రామం, జామి మండలం

ఐదేళ్లలో పీహెచ్‌సీల ద్వారా అందించిన సేవలు.. నిర్వహించిన పరీక్షలు

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఉన్న పీహెచ్‌సీల్లో లక్షలాది మందికి వైద్య సేవలు అందించారు. ఐదేళ్లలో సుమారు 83 లక్షల మందికి వైద్యసేవలు అందించగా.. 24.62 లక్షల మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు.

సంవత్సరం	వైద్య సేవలు	ల్యాబ్ టెస్టులు
2019-20	18, 30, 368	5,89,860
2020-21	14,04,382	2,76,384
2021-22	19,06,334	4,94,148
2022-23	15,91,841	5,74,532
2023-24	15,92,686	5,27,219

తొలి ఓటు పడింది

- ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



జేఎన్‌టీయూ జీవీలో పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డస్క్



పోస్టల్ బ్యాలెట్ కోసం క్యూలైన్లో బారులు తీరిన ఉద్యోగులు

తొలిరోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ (నియోజకవర్గాల వారీగా) ఇలా..

నియోజకవర్గం	పోస్టల్ బాలెట్లు	తొలి రోజు పోలింగ్
బొబ్బిలి	2,105	749
చీపురుపల్లి	1,405	385
గజపతినగరం	1,655	603
నెల్లిమర్ల	1,525	587
విజయనగరం	3,975	1,356
ఎస్.కోట	1,776	563
రాజాం	1,741	746
మొత్తం	18,631	4,989

ఇతర జిల్లాల్లో పనిచేస్తూ ఇక్కడ ఓటు ఉన్న ఎన్నికల సిబ్బంది వేసిన పోస్టల్ బ్యాలెట్లు : 670

విజయనగరం అర్బన్: సాధారణ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రారంభమైంది. జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ కేంద్రాలను కలెక్టర్ నాగలక్ష్మి సందర్శించారు. ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. క్యూలైన్లు, పోలింగ్ బూత్‌లు, హెల్ప్‌డెస్క్‌లను సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లపై ఉద్యోగులను ఆరా తీశారు. పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది తమ ఓటు జాబితాలో లేదని చెప్పడంతో వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగి దరఖాస్తు చేస్తే, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తో పాటు జేసీ కె.కార్తీక్, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి కె.సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్ ఓటింగ్ ప్రక్రియను, ఏర్పాట్లను పర్యవేక్షించారు. గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, రాజాం, ఎస్.కోట నియోజకవర్గ కేంద్రాల్లోనూ తొలి రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది.